క్లుప్తంగా

కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



లింగాలఘణపురం: స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను హైదరాబాద్‌లో మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల నాయకులు దామెర నాగరాజు, బొల్లంపల్లి నాగేందర్, బోయిని రాజు ఉన్నారు.

యువతకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

కొడకండ్ల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం యువతను విస్మరించి నిరుద్యోగులుగా మార్చితే నూతనంగా రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు అండగా నిలుస్తుందని పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేశ్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయనవిలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకొని మల్లెపల్లి ఐటీఐలో ఏటీసీలకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామని, నిరుద్యోగ యువకులకు మంచి అవకాశమని ఆయన అన్నారు.

పండ్ల పంపిణీ

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో మంగళవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బాల్‌రెడ్డికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్ సెల్ కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, జంగిటి విద్యానాథ్, నల్లనాగుల వెంకటాచారి, మసూద్, జంగిటి నరేష్, పరిదె శ్రీనివాస్, జ్యోతి భాస్కర్, నీల రమేశ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



రాజు (ఫైల్)

బచ్చన్నపేట: ఇంట్లో ఎవరూ లేని సమయంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల రాజు (42) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రాజుకు భార్య, స్వప్న, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భార్య వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే లోగా ఇంట్లో ఉరి వేసుకొని రాజు మృతి చెంది కనిపించాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని శవానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. రాజు మృతి పట్ల గ్రామస్తులు సంతాపం తెలిపారు.

ప్రమాదవశాత్తు గీత కార్మికుడి మృతి



వెంకట్రాజం(ఫైల్)

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన సట్ల వెంకట్రాజం (51) మంగళవారం ఉదయం తాటిచెట్టుపై నుంచి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, గౌడ సంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రాజం రోజు మాదిరిగా కల్లు గీసేందుకు తాటి వనానికి వెళ్లాడు. చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాద వశాత్తు మోకు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, గీత కార్మికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం రాష్ట్ర కమిటీ బాధ్యులు కంకటి రాజన్న, కల్లు గీత కార్మిక సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్, జిల్లా నాయకుడు మాచర్ల ప్రవీణ్, జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లు, కుర్ర ఉప్పలయ్య, గనగోని రమేశ్ కోరారు.

బాలల హక్కులను కాపాడాలి



పాలకుర్తి : రాజ్యాంగం బాలలకు కల్పించిన హక్కులను కాపాడాలని బాలల హక్కుల సంరక్షణ సంస్థ వ్యవస్థాపకుడు ఎడవెల్లి సోము అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇటుక బట్టీల్లో బాలికలకు ఎలాంటి రక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్సై సాయి ప్రసన్న కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు, సిబ్బంది

తరిగొప్పుల: గ్రామపంచాయతీ సిబ్బందికి గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఎన్నో ఏళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీపీ కార్మికుల వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. 2వ పీఆర్సీ పరిధిలోకి జీపీ సిబ్బందిని తీసుకురావాలని కోరారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించి, పర్మినెంట్ చేయాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, పాత కేటగిరీలనిఎంటినీ యథావిధిగా కొనసాగించాలని అన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ ప్రమాద బీమా, గ్రాట్యూటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజకొమురయ్య,నాగపూరి సతీస్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాపై దివ్యాంగుల ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగులు

నర్మెట: మండలకేంద్రంలో దివ్యాంగుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కబ్జాచేశారని తమకు న్యాయం చేయాలంటూ ఇన్‌చార్జ్ (ఎఫ్‌ఏసీ) ఎంపీడీఓ అరవింద్ చౌదరికి మంగళవారం దివ్యాంగులు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. వివరాలు.. మండలకేంద్రంలోని 785 సర్వే నంబరులో 4.21 ఎకరములు పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం కొనుగోలు చేసి కొందరికి 110 గజాలు, మరికొందరికి 80 గజాలు కేటాయించింది. ఇందులో కొంత స్థలాన్ని దేవాలయం, పాఠశాల, ఆట స్థలం నిర్మాణాలకోసం కేటాయించడం జరిగింది. కాగా, తమకోసం కేటాయించిన స్థలంలో దన్నారపు శోభ మురళి (అంగన్‌వాడీ టీచర్) తనకు ప్రభుత్వం కేటాయించిన 80 గజాలతో పాటుగా అధనంగా మరో 40 గజాలు ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేపట్టిందని పేర్కొన్నారు. కాగా, మిగిలిన స్థలంలో సైతం ఇటీవల కారుకోసం షెడ్డు నిర్మాణం చేశారని, అధికారులు వారిపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. మోడెం రాజు, తీగల రామారావు తదితరులు ఉన్నారు.

సన్మానం



రమేశ్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లకు హెచ్‌ఎంలుగా వచ్చిన ఎం.సంపత్, కుసుమ రమేశ్‌లను పీఆర్‌టీయూ ఘన్‌పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు గిరెడ్డి ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి ఎక్కడ పనిచేసినా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ మండల నోడల్ అధికారి ప్రవీణ్, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, రవికుమార్, సత్యప్రకాష్, ప్రవీణ్, గిరి, శ్రీధర్, సదామోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నేత్ర వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, ఘన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హనుమకొండ శరత్ మ్యాక్స్ విజయ్ వారి సౌజన్యంతో ఈనెల 20న మండలంలోని శివునిపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డుతో రావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9704104472 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గిరి ప్రదక్షిణకు తరలిన భక్తులు



యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణలో భక్తులు

జనగామ: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో స్వాతి నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం జరిగిన గిరి ప్రదక్షిణకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్లారు. ప్రధాన అర్చకులు, అర్చక బృందం మంత్రోచ్చరణ నడుమ ప్రారంభమైన గిరి ప్రదరక్షణలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ ఈఓ భాస్కరావు, తదితర ప్రముఖులు పాల్గొనగా.. భక్తులు ముందుకు సాగారు. జనగామ భక్తులు తెల్లవారు జాము 4.30 గంటలకు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, యాదగిరిగుట్టకు బైక్‌లపై ర్యాలీగా బయలు దేరారు. గిరిప్రదక్షణ తర్వాత, మెట్ల మార్గం గుండా కొండపైకి చేరి, లక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. కార్యక్రమంలో ధర్మపురి శ్రీనివాస్, జక్కుల వేణు మాధవ్, చింతకింది మల్లేశ్, తుంగ కౌశిక్, అనంతుల ఆంజనేయులు, సొడ మహేష్, మడూరి రాజు, పాండు తదితరులు ఉన్నారు.

ఖబరస్తాన్ ప్రహరీ పనులు ప్రారంభం



ప్రహరీ పనులు ప్రారంభిస్తున్న జమున

జనగామ: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఏరియాలో రూ.5లక్షల నిధులతో చేపట్టిన ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణ పనులను కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి మల్లారెడ్డితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మారబోయిన పాండు, కో ఆప్షన్ సభ్యుడు మసిఉర్ రెహమాన్, కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ రహమాన్ షకీల్, మాజీ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పాలకుర్తి టౌన్: విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మండలంలోని పెద్దతండా(కె) గ్రామానికి చెందిన మేడ్చల్ జిల్లా బాచుపల్లి తహసీల్దార్ లావుడ్యా పూల్‌సింగ్ నాయక్ అన్నారు. పెద్దతండాలో ప్రాథమిక పాఠశాలలో 3నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఆయన మంగళవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూల్ సింగ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువులో రాణించి పాఠశాలకు, గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులకు పంపించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్‌సింగ్, శేషగిరిరావు, వెంకట నర్సయ్య, విజయరాణి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..



నివాళులర్పిస్తున్న నాయకులు

కొడకండ్ల: బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, మార్కెట్ చైర్మన్ పేరం రాములు అన్నారు. మండలంలోని నీలిబండతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గుగులోత్ జగన్‌నాయక్ మృతి చెందడంతో మంగళవారం నాయకులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు వెంకటేశ్వర్‌రావు, విమల, సోమాని, నియోజకవర్గ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ సతీష్‌గౌడ్, తుకారాంనాయక్, రణధీర్, చిలుకమ్మ పాల్గొన్నారు.

అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం బంగారు పుష్పాలతో అష్టదళ పాద పద్మారాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రమేష్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు, వసంత పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి

జనగామ రూరల్: నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని సామాజిక ఆరోగ్య అధికారి ఎం.రహమాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా జనగామ పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో 1–19 సంవత్సరాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఈనెల 20వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఆరోజు అందుబాటులో లేనివారికి 27వ తేదీన వేయనున్నట్లు పేర్కొన్నారు. అయా పాఠశాలలు, కాలేజీల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు మాత్రలు అందించాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అంగన్వాడీ టీచర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సహకరించాలని కోరారు.

బాబోయ్ కుక్కలు



వీధిలో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామంలో వీధికుక్కలు స్వైర్య విహారం చేస్తుండడంతో ప్రజలు వాటిని చూసి భయటకు రావడానికి జంకుతున్నారు. ఇటీవల మండలంలోని ఫత్తేపూర్‌లో కుక్కల దాడిలో బాలుడు మృతి చెందాడు. అప్పటి నుంచి కుక్కల భయంతో పిల్లలను ఒంటరిగా ఇంట్లో ఉంచకుండా వెంట తీసుకెళ్తున్నారు. ఇక రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై వచ్చేవారి వెంట పడటంతో కిందపడి గాయాలపాలవుతున్నారు. మరిన్ని సంఘటనలు జరుగకముందే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కుక్కలను చంపమనడం లేదని వాటిని లేకుండా చేయాలని గ్రామ ప్రత్యేకాధికారి విమల, పంచాయతీ కార్యదర్శి బాపునాయక్‌లను కోరారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం



పిచ్చికుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె

లింగాలఘణపురం: మండలంలోని కళ్లెంలో మంగళవారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేసి మబ్బు రమేశ్‌కు చెందిన గొర్రెను చంపి, రవి.. దుడ్డెను గాయపరిచాయి. అంతేకాకుండా గ్రామంలో ఉన్న మరో మూడు కుక్క పిల్లలను కరిచి చంపాయి. దీంతో గ్రామస్తులు పిచ్చికుక్కలను చంపేందుకు వెంటపడగా పారిపోయి మరికొద్ది సేపటికే గ్రామంలోనికి ప్రవేశించి దాడులు చేస్తున్నాయని, ఈ విషయంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠ్యపుస్తకాలు అందించాలి



మాట్లాడుతున్న కొమురయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్య, నోటు పుస్తకాలను పాఠశాలల్లో విద్యార్థులకు వెంటనే అందించాలని విద్యాశాఖ మండల నోడల్ అధికారి జి.కొమురయ్య అన్నారు. ఘన్‌పూర్ ఎస్సీ కాలనీ, మండలంలోని విశ్వనాథపురం బీసీ కాలనీ, తానేదార్‌పల్లి, మాన్‌సింగ్‌తండా, చంద్రుతండా ప్రభుత్వ పాఠశాలలు, నమిలిగొండ కేజీబీవీ పాఠశాలలను ఘన్‌పూర్ జెడ్పీఎస్‌ఎస్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్‌తో కలిసి మండల నోడల్ అధికారి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలన్నారు. ఉపాధ్యాయులు జయమ్మ, సుజాత, కొమురెళ్ళి, అశోక్, వెంకటచారి, రమేష్, శ్రీదేవి, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి వైద్యానికి ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన రిపోర్టర్ నారబోయిన గోపాల్ ఇటీవల అనారోగ్యానికి గురై హనుమకొండ రోహిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, అతడి ఆరోగ్య పరిస్థితి తెలిసి వైద్య ఖర్చుల నిమిత్తం బాల్య స్నేహితులు తమవంతు బాధ్యతగా మంగళవారం ఫోన్‌పే ద్వారా రూ.15వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్నేహితుడు గోపాల్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా చిల్పూరు దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ రమేశ్ రూ.1,000 అందించారు. కొత్తపల్లి శ్రీనివాస్, నోముల రాజేశ్వర్‌రెడ్డి, వకుళమాల, కొండపర్తి రమాదేవి, బొంకూరి యాదగిరి, మారపాక రాజయ్య, కుంచాల రాజు, ఉమారాణి, పాందరి, మహేష్‌నాయక్, సంపత్‌రెడ్డి, ఎలేంద్ర, రమ్యశ్రీ, దివ్య, మల్లేశం, రాజు, మనిదీప్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని రఘునాథపల్లి 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు నేపథ్యంలో ఈ నెల 19న పలు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ వేణుమాధవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రఘునాథపల్లి, నిడిగొండ, గబ్బెట, కంచనపల్లి, కుందారం, వడిచర్ల, లింగాలఘణపురం, కోమల్ల, ఖిలాషాపూర్, అశ్వరావుపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బాలరాజ్

చిల్పూరు: పద్మశాలీ కులస్తులు ఐకమత్యంతో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని, ఆ దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు వేముల బాలరాజ్‌నేత పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో మంగళవారం నియోజకవర్గం ఇన్‌చార్జ్ గజ్జెల దామోదర్ అధ్యక్షతన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులను గుర్తించి వారికి ప్రభుత్వ పరంగా పథకాలు అందేలా చూడాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఉన్నచోట పోటీ చేయాలని, దీంతో సంఘం పటిష్టంగా ఉంటుందన్నారు. ఈ నెల 25వ తేదీ లోపు రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేసియా, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. జిల్లా కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, శ్యామల పరమేశ్వర్, భిక్షపతి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

భూమి ఇప్పించి న్యాయం చేయండి



న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితులు

చిల్పూరు: గ్రామంలోని 40 మంది నిరుపేదలకు ఎకరం భూమి చొప్పున ప్రభుత్వం పట్టాలు ఇవ్వగా గ్రామంలోని కొందరు తమకు తెలియకుండా అమ్ముకున్నారని దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలంటూ బాధితులు కోరారు. మంగళవారం భూ బాధితులు చేరాలు, పోషయ్య, సాయవ్వ, కనుకవ్వలు మాట్లాడుతూ 1990 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నంబరు 63, 64లో 40 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పున పట్టాలు చేసి ఇచ్చిందన్నారు. అందులో వర్షాలు పడినపుడు పంటలు వేసుకుని ఉండే వారమని, తదుపరి వర్షాలు కురవకపోవడంతో పొట్టకూటి కోసం గ్రామాన్ని వదిలి ఇతర గ్రామాలకు వలస వెళ్లినట్లు తెలిపారు. తిరిగి వర్షాలు మొదలు కాగానే గ్రామానికి వచ్చి తమ భూముల వద్దకు వెళ్లగా కొన్న వారు తమను అడ్డుకుని కాగితాలు చూపించారని, దీంతో తాము వారిని నిలదీయగా గ్రామానికి చెందిన నాయకులు తమ పేరున ఫోర్జరీ సంతకాలు చేసి పట్టాలు మార్చి ఉన్నాయని అన్నారు. తమకు న్యాయం చేయాలంటూ సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినా నేటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇచ్చినందున ప్రస్తుత కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈవిషయంలో న్యాయం చేసి తమ పేరు మీద పట్టాలు చేయించి భూమిని ఇప్పించాలని వేడుకుంటున్నారు. అదే విధంగా ఫోర్జరీకి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని కోరారు.

నాసిరకం పనులపై చర్యలు చేపట్టాలి

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని 13వ వార్డులో నాసిరకంగా నిర్మాణం చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనులపై తగు చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన ఠాకూర్ గణేష్‌సింగ్ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు గణేష్‌సింగ్ చెప్పారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా 13వ వార్డులో నిర్మించిన సైడ్ డ్రెయినేజీ పనులు నాణ్యతతో చేపట్టామని.. అతని ఆరోపణలో వాస్తవం లేదని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బచ్చన్నపేట: కొన్నె గ్రామంలో కట్కూరి సిద్దులు ఇటీవల మృతి చెందాడు. కాగా సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల సాయం మంగళవారం అందజేశారు. బాల్‌రెడ్డి, భాస్కర్, కనుకయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.